


# ప్రియురాలు పిలిచె

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



### (గత సంచిక తరువాయి)

“ఏ అనుమానం?”

కార్తికేయ కుర్చీ వెనక్కి తాపీగా వాలుతూ అన్నాడు. “కొడుకుని అమెరికా పంపించాలనీ, కూతురు పెళ్ళి చెయ్యాలనీ కళ్యాణిని లక్షరూపాయలు అడిగారు గుర్తుందా? అప్పుగా కావాలా, అకౌంట్‌లో కావాలా అని ఆమె అడిగింది. తేడా ఏమిటంటే ‘వడ్డీ’ అని అన్నది. గుర్తుందా?”

“ఇదంతా మీరు నా కెందుకు చెపుతున్నారు?”

కార్తికేయ కుర్చీలోంచి లేచి బల్ల చుట్టూ తిరిగి, ప్రతాపరెడ్డి కూర్చున్న కుర్చీ వెనక్కి వచ్చి, అతని భుజం మీదుగా వంగి “లక్షరూపాయలూ తీసుకోకుండా మీరు మీ కొడుకుని అమెరికా ఎలా పంపించారు? కూతురి పెళ్ళి ఎలా చేశారు?” అని అడిగాడు.

ప్రతాపరెడ్డి మొహం జేవురించింది. ఛివాలున కుర్చీలోంచి లేచి, “ఇదంతా మీకు చెప్పవలసిన అవసరం నాకు లేదు” అన్నాడు..

“మీకు మా సంస్థ తప్ప, డబ్బు ఇచ్చే కంపెనీ వేరే ఏదీ లేదు. మీకు వేరే ఆస్తులు కూడా ఏమీ లేవు. మరి ఆ లక్షరూపాయలూ ఎక్కడినుంచి వచ్చాయి? మీ ఇన్‌కంటాక్స్ రిటర్న్‌లో కూడా ఆ డబ్బు ప్రసక్తిలేదు.”

ప్రతాపరెడ్డి మొహంలో రక్తం ఇంకింది. “నా మీదే డిటెక్షన్ మొదలుపెట్టారా?” అన్నాడు. కార్తికేయ ఆ మాటలు పట్టించుకోకుండా చెప్పటం సాగించాడు. “సత్యం గురించి ఇన్వెస్టిగేట్ చెయ్యమని శ్రీకళ్యాణి మీకు చెప్పిందే. అది ఇంకా పూర్తి చెయ్యలేదు.”

“ఇంకా పరిశోధన జరుగుతూ ఉంది.”

“ఈ లోపులో శ్రీకళ్యాణికి జరగ వలసిన అపకారం జరిగిపోయింది.”

“దానికి కారకులైన వారిని కూడా పట్టుకుంటాము.”

‘‘అవసరం లేదు. అది నేను తెలుసుకోగలను. మిమ్మల్ని కనుక్కోమన్నది సత్యం వెనుకున్న వారెవరని? మిస్టర్ రెడ్డీ! శ్రీకళ్యాణీ ఏజెన్సీస్ అటార్నీ హోల్డరుగా మీ నుంచి వివరణ అడుగుతున్నాను. మీకు లక్షరూపాయలు ఎక్కడ్నుంచి వచ్చాయి?’’

‘‘అది నా వ్యక్తిగత విషయం.’’

‘‘సరే అయితే. ఈ క్షణం నుంచీ సిగ్మా ఏజెన్సీ సర్వీసుల్ని నేను రద్దు చేస్తున్నాను. అకౌంటెంట్ దగ్గర మీకు రావల్సిన చెక్ తీసుకుని వెళ్ళిపొండి’’

ప్రతాపరెడ్డి పిడికిలి బిగించి టేబుల్ మీద బలంగా కొట్టాడు. కోపంతో అతని కళ్ళు ఎర్రబడ్డాయి. ‘‘ఒక్కరోజు అధికారంలోకి వచ్చావో లేదో నన్నే తీసేసే స్టేజికి వచ్చావా? ఇదంతా నీ భార్య ఒప్పుకుంటుందని అనుకున్నావా?’’

‘‘ఒప్పుకుంటుంది.’’

‘‘ఏ ధైర్యంతో చెపుతున్నావు?’’

టేబిల్ లోంచి ఒక కాగితం తీసి చూపిస్తూ ‘‘ఈ ధైర్యంతో చెపుతున్నాను’’ అన్నాడు కార్తికేయ. ‘‘...అయిదు నిముషాల క్రితం నా పెన్ను సరిగ్గా వ్రాయటం లేదని మీ దగ్గర్నుంచి పెన్ను తీసుకున్నాను గుర్తుందా? ఆ పెన్‌తో వ్రాసిన అక్షరాలు ఇవి’’ అంటూ డ్రాయర్ లోంచి మరో కాగితం తీశాడు. ‘‘మా ఇంటి పక్క టెలిఫోన్ బూత్ నా స్నేహితుడిది అవటం, మీ దురదృష్టం. ఇందులో నా పేరు వ్రాసిన పెన్నూ, మీ పెన్నూ ఒకటి కాదంటారా?’’

ప్రతాపరెడ్డి మొహం తెల్లగా పాలిపోయింది. అయినా బింకంగా సర్దుకుని, ‘‘కాదు. నా కసలు బొంబే ఫోన్ ఏమిటో ఎక్కడిదో కూడా తెలీదు’’ అన్నాడు.

‘‘తెలీదా? తెలియకుండానే ఓడ మునిగిపోయిందన్న వార్త వచ్చిన రోజు రాత్రి మీ ఆఫీసు నుంచి బొంబే షిప్పింగ్ కంపెనీకి మీరు ఫోన్ చెయ్యలేదా? ఇదిగో మీ ఆఫీసు ట్రంకాల్ రిజిష్టర్. ఇది నాకెలా వచ్చిందని ఆశ్చర్యపోకండి. చేశారా లేదా? అది చెప్పండి’’ అంటూ పుస్తకాన్ని ముందుకు తోశాడు.

అణువిస్ఫోటనం జరిగిన తరువాత లాంటి నిశ్శబ్దం ఆ గదిలో అలుముకుంది. నాలుగువైపులా తలుపులు వేసి బంధింపబడిన పిల్లిలా అయిపోయాడు ప్రతాపరెడ్డి. ‘‘వెళ్ళిరండి మిస్టర్ రెడ్డి! You are sacked’’ మర్యాదగా అన్నాడు కార్తికేయ.

ప్రతాపరెడ్డి కుర్చీలోంచి నెమ్మదిగా లేచి తలుపు వరకూ వెళ్ళి ఆగి ‘‘ఈ క్షణం నుంచీ నేను నీకు కనపడను. కానీ నీ అంతు చూస్తాను. నా పాతికేళ్ళ పోలీసు అనుభవంతో నీ తండ్రిలాగే నిన్నూ శంకరగిరి మాన్యాలు పట్టిస్తాను’’ అన్నాడు. అతడి వెనుకే తలుపు నెమ్మదిగా మూసుకుపోయింది.

కార్తికేయ చాలాసేపు అలాగే కూర్చుండి పోయాడు. అయిష్టంగా చేసిన యుద్ధంలో గెలిచిన రాజు... మృతానికీ, అమృతానికీ తేడా తెలియని స్థితిలో పొందే శ్మశాన వైరాగ్యం. నాకున్నవాళ్ళు, నా అనుకున్నవాళ్ళు నా కన్ను పొడిచేవాళ్ళయితే ఇక ఆనందం ఎక్కడిది?

ఆపై అతను క్షణాల్లో సర్దుకుని పీటర్‌కి ఫోన్ చేశాడు. ''థాంక్స్. చాలా తక్కువ సమయంలో చాలా అమూల్యమైన వివరాలు ఇచ్చి సహాయం చేశారు.''

''చెప్పానుగా కార్తీక్. నువ్వు నాకు చేసిన సాయంతో పోల్చుకుంటే నేను చేసింది చాలా చిన్నది.''

''కానీ నా మూలంగా ఇప్పుడు మీ ఉద్యోగం పోబోతున్నది.''

'వ్వాట్' పీటర్ గొంతు కీచుగా ధ్వనించింది. ''నా ఉద్యోగం పోతుందా?'' రుద్ధంగా అడిగాడు.

''సిగ్మా ఏజెన్సీని తొలగించాము. ఫలితంగా మీ ఉద్యోగాలన్నీ పోవచ్చు. పైగా ప్రతాపరెడ్డికి మీమీద ఈపాటికే అనుమానం వచ్చి ఉండవచ్చు. నాకు వివరాలందించగలిగింది మీరొక్కరే కదా.''

అట్నుంచి పీటర్ మాట్లాడలేదు. అతడింకా ఆ వార్త తాలూకు షాక్‌లోనే ఉన్నాడు.

''శ్రీకళ్యాణీ ఏజెన్సీస్ సెక్యూరిటీ బాధ్యత మీరు తీసుకోగలరా?''

''వ్వాట్...'' పీటర్ గొంతు మళ్ళీ కీచుగా ధ్వనించింది. అయితే ఈసారి షాక్‌తోనూ, దుఃఖంతోనూ కాదు. ''నేను... నేను సెక్యూరిటీ తీసుకోవటమా?'' ఆనందంతో అతడి కంఠం వణికింది.

''మీరొకసారి రండి. మిగతా విషయాలు మాట్లాడుకుందాం''. పీటర్ పది నిమిషాల్లో అక్కడి కొచ్చాడు. అతడి మొహం ఇంకా ఉద్విగ్నంగానే ఉంది. ''నేను... నేను శ్రీకళ్యాణీ ఏజెన్సీస్ విజిలెన్స్ ఆఫీసరా?'' అన్నాడు.

''ఔను. అక్కడ ఎడారిలో మీ బోళాతనం, కంగారూ చూశాను. ఇప్పుడు ఈ రోజు వర్క్‌లో మీ సిన్సియారిటీ, వేగం చూశాను. ఇన్ని అర్హతలున్న వ్యక్తి నాకెక్కడ దొరుకుతాడు? అదీగాక ఈ ఊర్నుంచి జైసల్మీర్ ఎడారుల వరకూ కలిసి ప్రయాణం చేశాం కూడా.''

పీటర్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ''అవును తిరిగాం. కానీ అప్పుడు 'ఈ కుర్రాడిని ఎడారి మధ్యలో ఎలా వదిలి పెట్టాలా' అన్న రాక్షస ఆలోచనే ఉంది! అలాటి నన్ను ఈ...రో... జు... నువ్వు...'' ఆపైన మాట్లాడలేకపోయాడు. నిజంగా అతడికా రోజు ఉద్యోగం పోతే మరుసటి రోజు నుంచీ కుటుంబం మొత్తం వీధిన పడాల్సిన ఆర్థికస్థితి. కార్తికేయ అన్నట్టు అతడికి లౌక్యం తెలియనితనం బోళాతనం ఉంది. పని చేయటమే తప్ప నాలుగురాళ్ళు వెనకేసుకోవటం తెలీదు. మొదటి పరిచయంలోనే కార్తికేయ ఈ గుణాలన్నీ గ్రహించాడని కూడా అతడికి తెలీదు. అందుకే ప్రతాపరెడ్డిమీద అనుమానం వచ్చినప్పుడు అతడి గురించి వివరాలు సేకరించటానికి పీటర్‌ని ఎన్నుకున్నాడు. అతడు ఊహించినట్టే కేవలం ఆరుగంటల్లో అతడికి కావలసిన వివరాలన్నీ సేకరించి పెట్టాడు పీటర్.

కారు ఎక్కించటానికి బయటికి వస్తూ అడిగాడు. ‘‘ఆ సిగ్మా ఏజెన్సీలో చేయటానికి ముందు మీరు ఎక్కడ పని చేసేవారు?’’

‘‘సైన్యంలో’’ అన్నాడు. ఆ మాటలకి కార్తికేయ మొహంలో అప్రయత్నంగా నవ్వు వెలిసింది. ‘‘ ఉద్యోగంలోంచి తీసేసినప్పుడు ‘నా అంతు చూస్తా’నని బెదిరించి వెళ్లాడు ప్రతాపరెడ్డి. ఒక పోలీసు అధికారి బారినుంచి మమ్మల్ని రక్షించుకోవటానికి ఒక సైనికాధికారిని నియమించామన్నమాట’’ అన్నాడు.

ఆ మాటలకి పీటర్ ఉద్వేగంగా ‘‘లంచాలకి పోలీసు లొంగుతాడేమో కానీ, సైనికుడు లొంగడు కార్తీక్!’’ అన్నాడు. ‘‘నేన్నిన్ను ఎడారి మధ్యలో వదిలిపెట్టాను. నువ్వు నన్ను ఊబి మధ్య నుంచి రక్షించావు. నువ్వీరోజు చేసిన సాయానికి నీ రక్షణ కోసం నా ప్రాణాలైనా అర్పిస్తాను.’’

## 5

**‘‘మొదటిరోజు** ఆఫీసు ఎలా ఉందో చెపుతారనుకున్నాను. చెప్పనేలేదు’’ నిష్ఠూరంగా అంది శ్రీకళ్యాణి. అతడు ఆమెవైపు బ్లాంక్‌గా చూసి ‘‘నిజం చెప్పమంటావా?’’ అన్నాడు. ఆమె చెప్పమన్నట్టూ తలూపింది. చెప్పబోయి ఆగిపోయాడు. ఏం చెపుతాడు?

***ఒక చిత్రకారుడు నల్లటి కాన్వాస్ మీద నా మనసుని బొమ్మగా గీస్తే– ‘ఇది ఇంత వికృతంగా ఉందా?’ అన్న ఆత్మన్యూనతా భావంతో ఆత్మహత్య చేసుకుంటాను! ఈ రోజు నా మనసు నాకు అంత స్పష్టంగా కనబడింది. అది కుర్చీకాదు. విక్రమార్కుడి సింహాసనం. అందులో కూర్చోగానే నేను మారిపోయాను. ఒకర్ని ఉద్యోగంలోంచి తొలగించాను. ఒకరితో శతృత్వం పెంచుకున్నాను. మరొకరి మీద నిఘా పెట్టాను. అన్నిటికన్నా ముఖ్యంగా నా కుంచె– మేఘాల పొత్తిళ్ళలో పడుకున్న చందమామ చెక్కిలి మీంచి గులాబీరంగు– నీటి చెంపల్ని తాకుతూ వయ్యారంగా సాగిపోయే చేపపిల్ల కళ్ళల్లోంచి నీలిరంగు– వెన్నెల తాకిడికే కందిపోయి, మంచులో శీతల స్నానం చేసే సన్నజాజుల రేకుల దొప్పల్లోంచి తెలుపు– రెండు నక్షత్రాలు ముద్దు పెట్టుకుంటున్న వేళ చెదిరిన చీకటిలోంచి నలుపు– ముగ్గులగొబ్బికి పసుపు కుంకుమలద్దే సిగ్గులదొంతి బుగ్గల అరుణిమని సూర్యుడి కన్నా ముందే వడిసి పట్టుకుని, అందులోంచి ఎరుపు... అలా సప్తవర్ణాలనీ స్నేహంగా పలకరించే నా మనసు కుంచె – స్వచ్ఛత తప్ప మరేమీ తెలియని నా మనసు కుంచెఈ రోజు ఒక వాస్తవాన్ని నగ్నంగా చిత్రీకరించింది. ఇదంతా నీకెలా చెప్పను?***

‘‘మాట్లాడరేం?’’ అన్న ఆమె మాటలకి తెప్పరిల్లి, ‘‘కళ్యాణీ, నువ్వేమీ అనుకోకపోతే– నన్నీ బంధాన్నించి విముక్తుడిని చెయ్యి’’ అన్నాడు.

ఆమె తెల్లబోయి, అంతలోనే తేరుకొని నవ్వేస్తూ ‘‘ఏమిటి? ఏవో గ్రంథాల్లో మాటలు మాట్లాడుతున్నారు?’’ అంది.

‘‘నేనీ వ్యాపారాలకి తగను కళ్యాణి. ఇంకెవర్నైనా నియమిద్దాం. లేకపోతే అన్నీ అమ్మేద్దాం.’’

''మీరీ వ్యాపారానికి తగరా? ఎవరైనా వింటే నవ్విపోతారు. ఈ రోజు మీరు చేసిన పనులకీ, తీసుకున్న నిర్ణయాలకీ వాళ్ళందరూ స్టన్నయిపోయారు.''

''చెయ్యగలగటం వేరు. చెయ్యటం ఇష్టం లేకపోవటం వేరు.''

ఆమె మొహంమీద నవ్వు మాయమైంది. ''ఎందుకు ఇష్టంలేదు? డబ్బు లేకపోతే ఎలా బ్రతుకుతాం?'' అంది అర్థంకానట్టు.

''ఎయిర్ కండిషన్డ్ బెడ్‌రూమ్, ఎ.సి. కారు, సంవత్సరానికి ఒకసారి విదేశీయానం– అన్నీ కలుపుకున్నా పదిలక్షల ఆస్తిమీద వచ్చే వడ్డీ చాలు కళ్యాణీ. ఎందుకీ టెన్షన్?''

''మరి రోజంతా ఏం పని చేస్తాం?''

***రోజంతా ఏమీ చెయ్యొద్దనటం లేదు. 'రోజంతా' చెయ్యొద్దంటున్నాను. మన జీవితాల్లో షాపింగూ, ఎ.సి. కార్లూ తప్ప మరేమీ మిగలటం లేదు కళ్యాణీ! ఓ చిర్నవ్వు, వర్షం రాత్రి కుటుంబంతో సరదాగా కబుర్లు, అనారోగ్యంతో బాధ పడుతున్న తల్లి మంచం మీద పక్కనే కూర్చుని మాట్లాడటం, ఆర్తిగా కంఠాన్ని పెనవేసుకున్న ఓ చెయ్యి, పిల్లల ఆటలూ... అన్నీ అన్నీ ఉంటాయేమో కానీ... వీటిని గమనించటం మాత్రం ఉండదు. రాత్రంతా జారిపడిన మల్లెల్ని తెల్లవారుజామునే చూసి ఆస్వాదించే శక్తి ఉండదు. నేను భావుకత్వం గురించి మాట్లాడటం లేదు కళ్యాణీ. రోజుకో... నెలకో... సంవత్సరానికో... ఏదో ఒక సౌందర్యం... మరేదో ఒక సంతోషం మునివేళ్ళతో మనసుని మీటకపోతే ఇక జీవితాలెందుకు? కానీ... మన సంతోషాలన్నీ అవతలివాళ్ళ ఓటముల మీద ఆధారపడి ఉండటం ఎంత దురదృష్టకరమైన విషయం. నేనిదంతా చేయలేకా, వ్యాపార విషయాలు నిర్వర్తించలేకా చెప్పటం లేదు. తృప్తికి మించిన ఆస్తి మరొకటి లేదు. పక్కింటి భార్యాభర్తల పోరాటం చూడటం కన్నా, జారిపడే వర్షపు చినుకుని చూడటం తృప్తినిస్తుంది. లక్షరూపాయల ఇన్‌కంటాక్స్ ఎగ్గొట్టటం కన్నా– ఒక మంచి పుస్తకం చదవటం తృప్తినిస్తుంది. జమిందారుకి కొడుగ్గా, ఒక బికారికి వారసుడిగా నేనీ సత్యాన్ని చెప్పగలను! ఎక్కడ నీలివర్ణపు మేఘాలు పవిత్రంగా చిరునవ్వు వొలికిస్తూ వర్షాక్షిత దీవెనలు కురిపిస్తాయో– ఎక్కడ మమతల నునులేత కెరటాలు తల్లి పాలకి మల్లే స్వచ్ఛంగా పొంగి పొర్లుతాయో– ఎక్కడ పావురాళ్ళ రెక్కల నీడల్లో మనిషి శాంతిగా బ్రతగ్గలడో– అక్కడే ఉంటుంది ఆనందం.***

''ఏమిటి. మీరేమీ మాట్లాడటం లేదు?''

అతను ఉలిక్కిపడి, ''ఏం అడిగావు నువ్వు?'' అన్నాడు.

''మరి రోజంతా ఏం పని చేస్తాం?'' అని అడిగాను.

*నేను దీనికి జవాబు చెప్పలేదా? అయ్యో– నా నోటికికూడా మనసు సహకరించటం లేదా? ఇంతవరకూ చేతలకే అనుకున్నాను.*

అతను సర్దుకుని– ''దానికేంగానీ, నీ గుండె ఆగిపోయే వార్త చెపుతాను. సిద్ధంగా ఉండు'' అన్నాడు.

ఆమె నవ్వి ''ఆనందంతోనా? విషాదంతోనా?'' అంది.

''షాక్‌తో''

''ఏమిటది?''

''సిగ్మా డిటెక్టివ్ ఏజెన్సీస్ ప్రతాపరెడ్డిని ఉద్యోగంలోంచి తొలగించాను.''

''ఏ...మి...టీ'' ఆమె అప్రయత్నంగా అరిచిందో, అతడన్నట్లు షాక్ తగిలిందో గానీ గొంతు మాత్రం జీరబోయింది.

''అవును కళ్యాణీ...'' అంటూ మొత్తం జరిగినదంతా చెప్పాడు. ఆమె చాలాసేపు మాట్లాడలేదు. అతను సందిగ్ధంగా ''నేను చేసింది పొరపాటు చర్య అంటావా?'' అన్నాడు.

ఎలా చెప్పాలా అన్నట్టు ఆమె కళ్ళు విప్పారితం చేసి చూసింది. క్రమక్రమంగా ఆమె కళ్ళల్లో అల్లరి చోటు చేసుకుంది. ''ఇలా దగ్గరకు రండి'' అంది.

అతను వేరే మూడ్‌లో ఉండి ''దేనికి?'' అన్నాడు. ఆమె చిలిపిగా ఒక కన్నుమూసి, మరో కన్ను తెరిచి రెప్పవాల్చింది. అర్థమై అతడామె మీదకు వంగాడు.

అతడి పెదవుల మధ్యకు ఆమె నాలుక చొప్పించి, పై పెదవి వెనుకభాగాన్ని సుతారంగా రాసింది.

**జీవితంలో మొదటి ముద్దు – మెదడు బ్లాంక్ అయి అసలేమీ గుర్తుండదట.**

**రెండో ముద్దు – ఒక తుషార పవనం వెన్నుపూస మీదనుంచి వెళ్ళిపోయినట్టు ఏదో కాస్త తెలుస్తుందట.**

**ఇక మూడో ముద్దు నుంచీ – అప్పటివరకూ మామూలుగా వ్రాసుకుపోతున్న రచయితకి ఒక మంచి సిట్యువేషన్ దొరికి, దాన్ని విజృంభించి వ్రాయటానికి ఆయత్తమవగానే, భావనాలోకపు వర్ణనలన్నీ ఒకదాన్నొకటి 'నన్ను వ్రాయవా– నన్ను వాడుకోవా' అంటూ తోసుకొచ్చినట్టు... శరీరపు నలుమూలల్నుంచీ అవయవాలన్నీ 'మాక్కొంచెం ఇవ్వవా– ఆ సంతోషం మాక్కొంచెం పంచవా' అంటూ నరాల కొసల్తో సందేశం పంపిస్తాయట. అందుకే రెండు నిముషాలకన్నా 'తక్కువ' సేపు ముద్దు పెట్టుకునే వాళ్ళకి, వయసు పెరిగే కొద్దీ నరాల బలహీనత వస్తుందట.**

''మీరు కొంచెం నాలుక బయటపెట్టండి'' అంది. అర్థంకాక ''ఎందుకు?'' అంటూ చాపేడు.ఆమె తన నాలుకతో ఒక్కొక్క అక్షరమే దానిమీద వ్రాసి ''ఏం వ్రాశానో చెప్పుకోండి చూద్దాం'' అంది.

''అర్థం కావటంలేదు.''

''మొత్తం 19 అక్షరాలు. అయిదు పదాలు'' అంటూ అతడి నాలుక మీద మళ్ళీ వ్రాసింది. అతడు ఒక్కొక్క అక్షరం చెప్పటం పూర్తిచేశాడు. ''యు... ఆర్... ఎ... YOU ARE A WONDERFUL MAN'' అని. ఆపై ఆమె నుంచి విడివడి ''ఎందుకట'' అన్నాడు.

''ఇంతకాలం నాకు అతడు అడిగిన ఆ లక్షరూపాయల గురించి అనుమానమే రాలేదు. మీరు ఒక్క రోజులో పట్టుకున్నారు. ఇదంతా తనే చేశాడని ఒప్పుకునేలా చేశారు. ఏది ఏమైనా మీరు నాకన్నా పెద్ద పారిశ్రామికవేత్త అవుతారు.''

''బాబోయ్ వద్దు. ఇంకో నాల్రోజులు ఆ వ్యాపారంలో ఉంటే హిమాలయాల్లో చేరి, సన్యాసుల్లో కలిసిపోతాను.''

''అలా అనకండి. తథాస్తు దేవతలు ఉంటారట'' అంది.

అంతటి అమ్మాయి కూడా అలా మాట్లాడటం అతడికి గమ్మత్తుగా ఉంది. ''అద్సరే గానీ, వచ్చే నెల నేను సిమ్లా వెళతాను... రెండ్రోజులే. వచ్చాక ఆలోచిద్దాం'' అన్నాడు.

''మీరు లేకుండా రెండ్రోజులా?'' దిగులుగా అంది.

అతను నవ్వి ''పెళ్ళయి వారం కూడా కాలేదు'' అన్నాడు ఉడికిస్తున్నట్టు.

**''హృదయం వర్జిన్‌గా ఉన్నవాళ్ళు పెళ్ళయిన మొదటి రోజే భర్తంటే ప్రేమలో పడతారు. అలా పడకపోతే వారికి బలమైన వ్యక్తిత్వం ఉన్నదన్నమాట. లేదా వారిలో ఏదో డిఫెక్టు ఉందన్నమాట.''**

''అంటే నా హృదయం వర్జిన్ కాదంటావా?''

''ఏమో... సిమ్లా అంటున్నారు...'' అల్లరిగా నవ్వింది. ''అసలే చలికాలం వస్తోంది. అక్కడేమో మంచు కొండలు'' అంటూ, అతడు చెవి మెలిపెట్టగానే కెవ్వున అరుస్తూ ''బాబోయ్ వదలండీ... ఇంతకీ ఎందుకట సిమ్లా'' అంది.

''కల్చరల్ మీట్ ఉంది. నేషనల్ లెవల్ కాంపిటీషన్స్. నాట్యం, నాటకం, చిత్రలేఖనంలో దేశపు అత్యున్నత బహుమతినిచ్చే పోటీలున్నాయి. చూడటానికి వెళ్తున్నాను...''

''దానికి మీరు ఎంట్రీ పంపించారా?''

''ఎంట్రీనా. ఇంకా నయం.. ఎంట్రీ ఫీజు అయిదువేల రూపాయలు.''

''అదో లెక్కా''

''ఇప్పుడు కాకపోవచ్చు. వారం రోజుల క్రితం నా సర్వస్వం అమ్మినా కూడా అయిదు వందలు వచ్చేది కాదు. అయినా ఇప్పుడు ఎంట్రీకి ఎక్కువ టైమ్ లేదులే. ప్రేక్షకుడిలా వెళతాను.''

''మీలో నాకు నచ్చిన మరో విషయం చెప్పనా! ఒకసారి 'ఇది నాకు సంబంధించిన విషయం' అనుకున్నాక ఎవరి సలహాలూ అవసరం లేకుండా మీరే నిర్ణయాలు తీసుకుంటారు. ఇన్నేళ్ళుగా మనకు పని చేస్తున్న సిగ్మా ఏజెన్సీస్‌ని క్షణాల్లో తొలగించారు. కనీసం నాకు చెప్పాలని కూడా అనిపించకపోవటం... అదీ ఉత్తమ ఎగ్జిక్యూటివ్ లక్షణం. మనస్ఫూర్తిగా బాధ్యత తీసుకున్నవాళ్ళకే ఆ నిర్ణయం తీసుకునే ధీమా వస్తుంది. ఐ లైకిట్ – మీ చేతుల్లో ఈ కళ్యాణీ, శ్రీకళ్యాణీ ఏజెన్సీస్... రెండూ నిశ్చింతంగా ఉండొచ్చు.''

''థాంక్స్'' అన్నాడతను మనస్ఫూర్తిగా. ఆమె మెడకీ భుజానికీ మధ్యగా చెయ్యి వేసి పొదివి పట్టుకుని తన గడ్డం క్రింద ఆమె తలని అమర్చుకుని తన ఊపిరికి కదిలే ఆమె ముంగురుల్ని చూస్తూ నిద్రపోవటం అతడు కొత్తగా చేసుకున్న అలవాటు. అలా అతడు నిద్రకుపక్రమిస్తూ ఉండగా, ఆమె సాలోచనగా ''ఎంత మోసపోయాను. మధ్యాహ్నం ఆ ప్రతాపరెడ్డి వచ్చి మీరు బొంబే టెలిఫోన్ చేశారంటే, అది మనిద్దరి మధ్య గొడవలు సృష్టించటానికి అనుకోలేక పోయాను. ఏదో గొప్ప ఇన్వెస్టిగేషన్ చేస్తున్నాడనుకున్నాను'' అంది.

ఒక సందిగ్ధం కొవ్వొత్తి వెలుగులా రెపరెపా కొట్టుకొంటూండగా అడిగాడు. ''ఎప్పుడొచ్చాడు?''

''ప్రొద్దున్న పదకొండింటికి.''

అరికాళ్ళ లోంచి వెయ్యికాళ్ళ జెర్రి గుండెల్లోకి జరజరా పాకిన జలదరింపు అతడిని సన్నగా వణికించింది. ప్రొద్దున్న పదకొండింటికి... అంటే తను లంచ్‌కి రాక ముందు..! అయినా తను ఇంటి కొచ్చినప్పుడు తన భార్య తనకీ విషయం చెప్పలేదు. 'ఇది నాకు సంబంధించిన విషయం అనుకున్నాక ఎవరికీ చెప్పనవసరం లేదు' అనుకోవటం ఉత్తమ ఎగ్జిక్యూటివ్ లక్షణం!

త...న...కి సంబంధించి కూడానా? రాత్రి వేదనను చీకటి తనలో దాచుకున్నట్టు అతడు గుండె చిక్కబట్టుకున్నాడు. ''టెలిఫోన్ రిజిస్టర్ కాగితం నీకు చూపించాడా?''

''అవునండీ...''

'మరి నాకు చెప్పలేదేం?' అని అడగలేదు.

**అంతా నాలోనే– నాకు తెలియకుండానే – నా స్పృహ రాహిత్యంలోనే – గుండె గులాబీ దండై గుబాళించటం లేదెందుకు – మనసంతా వెల్లవేసినట్టు ఒక్కసారిగా ఇలా అయిపోయిందేమిటి? మనం అనుకున్నట్టే మనవాళ్ళు ప్రవర్తించాలని అనుకోవటమంత అవివేకం మరొకటి లేదేమో. 'ఇలా జరక్కుండా ఉంటే బావుండేది' అనుకుంటాంగానీ మనోవైరుధ్యాలు తర్కానికి అందనివి కదా. నా భార్య తన మీద కన్నా నా మీదే ఎక్కువ నమ్మకం పెంచుకుందని క్షణం క్రితమే అనుకున్నానే! ఈ 'క్షణం' అనేది ఎంత కర్కశమైనది. రెప్పపాటులో ఆనందాన్ని విషాదంగా మారుస్తుంది. విషాదాన్ని వేదాంతంగా చీలుస్తుంది.**

నిద్ర రాక అతడు క్రిందకొచ్చాడు. హాల్లో ఆహ్వానిస్తున్నట్టు పెయింటింగ్ స్టాండ్. అతడు చేతుల్లోకి బ్రష్ తీసుకున్నాడు. గుండెల్లోంచి బాధని పిచికారీ చేస్తున్నట్టు బ్రష్ చిమ్ముతున్న రంగులు. వర్ణ మిశ్రమంతో హృదయ మైధునం గంటసేపు జరిగాక అతడి ఆవేశం చల్లారింది. మనసుని సమర్థించుకున్నాడు. ఆమె చేసిన తప్పేముంది? 'తరువాత తీరిగ్గా చెపుదామనుకుని ఉంటుంది' అనుకున్నాడు. మనసు తేలికయింది. పెయింటింగ్ ఆపి అతడు పైకి వెళ్ళి, ఆమె మెలకువగా ఉండటం చూసి, ''నువ్వింకా నిద్రపోలేదా?'' అన్నాడు.

“లేదు. చిన్న పనుంటే మన సెక్రటరీకి ఫోన్ చేసి చేయించాను. దానికేం గానీ ఒక ప్రశ్నకి సమాధానం చెప్పండి. నేను మంచిదాన్నా కాదా?”

అతడు నవ్వుతూ, “ఎందరో భార్యలు తమ తమ భర్తల్ని ఈ ప్రశ్న అడిగి, పాజిటివ్‌గానో, నిశ్శబ్దంగానో సమాధానం పొందివుంటారు. చరిత్రలో ఏ భర్తా నెగిటివ్‌గా సమాధానం చెప్పిన దాఖలాలు లేవు” అన్నాడు.

“బాబోయ్ అదంతా ఎందుకు గానీ, రేప్రొద్దున్నే మీ సిమ్లా టిక్కెట్ వస్తుంది.”

అతడు విస్మయంతో, “ఇప్పుడు నువ్వు ఫోన్ చేసింది టిక్కెట్ కోసమా?” అన్నాడు.

“కాదు. అంతకన్నా మంచి న్యూస్. ఆ టేప్ రికార్డర్ ఆన్ చేయండి. చెప్తాను.”

అతడు ‘ఆన్’ చేశాడు. “ఆజ్ మోసమ్ బడా బేయిమాన్ హై…” అంటూ ఆమెకిష్టమైన పాట వస్తోంది. “ఏమిటబ్బా అంత మంచి న్యూస్” అన్నాడు.

“నేషనల్ లెవల్ కాంపిటీషన్‌లో మీ ఎంట్రీ కూడా చేరుస్తున్నారు” అన్నదామె. అతడు తబ్బిబ్బై నమ్మశక్యం కానట్టు “నిజమా?” అన్నాడు ఎగ్జయిటింగ్‌గా. “… కానీ ఆ పోటీకి ఆఖరు తేదీ –”

ఆమె గర్వంగా తలెగరేసి “మరి శ్రీకళ్యాణి అంటే ఏమిటనుకున్నారు? మీ భార్యని తక్కువ అంచనా వేయకండి. భార్యల్ని తక్కువ అంచనా వేసిన మగవాళ్ళంతా తరువాత్తరువాత నడుము నొప్పితో బాధపడ్డారు” అంది.

ఆమె చివరి మాటలు అతను పట్టించుకో లేదు. ఏడుస్తున్న పిల్లాడికి తల్లి తాయిలం పెట్టగానే సంబరపడినంత స్వచ్ఛంగా “థాంక్స్ కళ్యాణీ” అన్నాడు.

ఆమె నవ్వుతూ, “రెండ్రోజుల్లో వచ్చేయండి. ‘మంచుకొండలూ– తెల్లదనం’ అంటూ అక్కడ ఉండిపోకండి. అసలే సిమ్లాలో మంచు తుఫానులు ఎక్కువట” అంది. అతడు ఆమెని మరి మాట్లాడనివ్వలేదు. టేప్‌లో ఇంకా రఫీ పాట వస్తూనే ఉంది. “ఆజ్ మోసమ్ బడా బేయిమాన్ హై ఆనెవాలా కోయీ తుఫాన్ హై…” (ఈ రోజు వాతావరణం నమ్మశక్యం కాకుండా ఉంది. రాబోయేది ఏదో తుఫానులా ఉంది.)

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments